క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కల్వకుర్తి టౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కల్వకుర్తి సీఐ నాగార్జున అన్నారు. ఎస్‌ఐ మాధవరెడ్డి కలిసి శుక్రవారం పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో ఈ సందర్భంగా ట్రాఫిక్‌ను పరిశీలించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్‌ను యథేచ్ఛగా అతిక్రమిస్తున్నారని, కూడళ్లలో ప్రధానంగా సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నట్లు గుర్తించామన్నారు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపిన వారికి జరిమానాలను విధించామన్నారు. కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయని తెలిపారు. హెల్మెట్, సీట్‌బెల్ట్, ధరించాలని కోరారు.

ఇంటి నిర్మాణ సామగ్రి అందజేత



వెల్దండ: మండల కేంద్రానికి చెందిన బస్మమోని చంద్రయ్యకు ఉప్పలట్రస్ట్ సంస్థ చేయూతనిచ్చింది. శుక్రవారం బాధితుడికి ఇంటి నిర్మాణ సామగ్రి సిమెంట్ బస్తాలు, ఇనుప కడ్డీలను అందజేశారు. పేదలకు అండగా ఉంటామని ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పూరి రమేష్, యువకులు తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



వంగూరు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ విజయభాస్కర్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశావర్కర్ల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని వీటిపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సమావేశంలో వైద్యాధికారిణి డాక్టర్ శృతి, సీహెచ్‌ఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల నమోదు



తాడూరు: మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను శుక్రవారం లబ్ధిదారులకు సంబంధించిన డాటా కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం ఇటీవల అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్నారు. మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని కంప్యూటర్ ఆపరేటర్లు వాపోయారు.

నోట్ పుస్తకాలు పంపిణీ



మన్ననూర్: స్థానిక గిరిజన బాలుర వసతి గృహం విద్యార్థులకు ఏపీఓ యాదమ్మ శుక్రవారం నోట్ పుస్తకాలు, కార్పెట్, టవాల్స్, దుప్పట్లు పంపిణీ చేశారు. వసతి గృహం ఆవరణలో ప్రభుత్వం అందిస్తున్న సేవలు, వసతులు భోజనం తదితరాల గురించి అడిగి తెలుసుకున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ రాజేందర్‌కు, తదితరులు ఉన్నారు.

నల్లమలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

అచ్చంపేట రూరల్: నల్లమల ప్రాంతంలో ఎన్నో వనరులు ఉన్నాయని, పర్యాటకంగా అభివృద్ధి చేయాలని టీపీసీసీ ఏఆర్‌ఐ సెల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ బొజ్జ అమరేందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును ఆయన ప్రత్యేకంగా కలిశారు. నల్లమల ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందితే ఉపాధి అవకాశాలు లభిస్తాయని, దీంతో కొంత మేరకు నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నల్లమలను పర్యాటకంగా తీర్చిదిద్దడానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ నేతృత్వంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి జూపల్లి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు నల్లమలలో పర్యటించడం శుభపరిణామన్నారు.

గుట్టలను తవ్వేస్తున్నారు

- ప్రకృతి సంపద కొల్లగొడుతున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు

మన్ననూర్: నల్లమల ఏజెన్సీ ప్రాంతంలోని ప్రకృతి ఇచ్చిన ప్రజల సంపద గుట్టలను అక్రమార్కులు తవ్వి మట్టి అమ్ముకొని సొమ్ము చేసుకొంటున్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామం పరిసర ప్రాంతంలో ఉన్న మల్లయ్య గుట్ట, పురుగుల గుట్టలతో పాటూ చెరువులను కూడా అక్రమార్కులు తవ్వేస్తున్నారు. కొంత కాలంగా ధనవంతులు పట్టణ ప్రాంతాల నుంచి వచ్చి మన్ననూర్ గ్రామంలోని శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి పొడుగున వ్యవసాయ పొలాలను లీజుకు తీసుకొని రెస్టారెంట్లు, రీసార్టులు, హోటళ్ల నిర్మాణాలు చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు వారితో లాలూచీ పడి వందల ట్రాక్టర్ల మట్టిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీకి గాని సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వకుండ ప్రకృతి సహజ సంపదగా ఏర్పడిన గుట్టలను జేసీబీలతో తవ్వి మట్టిని తీసి ట్రాక్టర్ల ద్వార అమ్మకాలు చేసి లక్షలు గడిస్తున్నారు. ఇదిలా ఉంటే అధికారులకు తెలిసే ఈ తతంగం అంతా జరుగుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. మట్టి ట్రాక్టర్లు ఇబ్బడి ముబ్బడిగా జాతీయ ప్రధాన రహదారిలో మట్టిని రోడ్లపై వెదజల్లుతూ అతివేగంతో రాకపోకలు చేస్తున్నప్పటికి అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మల్లయ్య గుట్ట పై భాగంలో ఎంతో చరిత్ర కలిగిన కాకతీయుల కాలం నాటి మల్లయ్య (శివుడి) గుడి ఉంది. అయినప్పటికి దర్జాగా మట్టిని తరలించేందుకు గానూ తప్పుడు భూమి పట్టా ధ్రువపత్రాలను సృష్టించి మా పట్టా పొలంలో తీస్తున్న మట్టికి మేము ఎవరికి చెప్పాల్సిన పని లేదని వాగ్వాదానికి దిగుతున్నారు. గతంలో పురుగుల గుట్ట వద్ద అచ్చంపేట ఆర్డీఓ మట్టి తరలించే వారికి నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా నాలుగు రోజుల కిందట పురుగుల గుట్టలో తవ్వకాలు చేస్తుంటే గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సంబంధిత తాహసీల్దార్ కార్యాలయం అధికారితో పాటూ పోలీసులు గుట్ట వద్దకు వచ్చారు. గమనించిన మట్టి తరలించే అక్రమార్కులు మెల్లగా అక్కడి నుంచి పరారయ్యారు. దుర్వాసుల చెరువులో గతంలో ఇటుకల తయారీ కోసం ఇష్టానుసారంగా గోతులు తీసి మట్టిని తరలిస్తే ఆ గోతులలో పడి ఇద్దరు చిన్నారులు, ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. అధికారులు స్పందించి గ్రామంలోని గుట్టలు, చెరువులను పరిరక్షించాలని రైతాంగం, ప్రజలు కోరుతున్నారు.



గుట్టను తవ్వి ట్రాక్టర్లలో మట్టిని నింపుతున్న జేసీబీ

ఏజెన్సీలో వాల్టాకు తూట్లు

నల్లమలలోని ఏజెన్సీ ప్రాంతంలో వాల్టా చట్టం అబాసుపాలు అవుతుంది. అమ్రాబాద్ మండలంలో అక్రమార్కులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. గ్రామంలోని దుర్వాసుల చెరువులోని నీటితో గతంలో రైతులు చెరువు కిందట ఏడాదికి రెండు పంటలు పండించే వారు. అటవీశాఖ నుంచి వచ్చే వరద నీరును ఇతర గ్రామాల వారు తమ ప్రాంతాలకు మళ్లించుకుపోవడంతో పాటూ మొరం కోసం, ఇటుకల తయారీ కోసం చెరువులో ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ గోతులు తవ్వి మట్టి, ఇసుక తీశారు. దీంతో వర్షాలు కురిసినప్పుడు వచ్చే వరద నీరు చెరువులోకి రావడం లేదు.

గుట్టలు, చెరువులను కాపాడండి



గ్రామంలోని గుట్టలు, చెరువులను అక్రమార్కులు తవ్వుతున్నారు. కొంత కాలంగా గ్రామంలో నిర్మాణాలు అవుతున్న రెస్టారెంట్లకు వందల ట్రాక్టర్ల మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధాన రహదారి గుండ ప్రజలకు ఆందోళన కలిగే రీతిలో ట్రాక్టర్లు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. సంబంధిత అధికారులకు సమస్యను పలు మార్లు తెలియజేసిన పట్టించుకోవడం లేదు.

–పులిజాల శేఖర్, మన్ననూర్ గ్రామస్తుడు

కేసులు నమోదు చేస్తాం

అక్రమంగా మట్టి తరలించే వారిపై వాల్టా చట్టంను అనుసరిస్తూ కేసులు నమోదు చేస్తాం. ప్రభుత్వ, ప్రజల ఆస్తులు, ప్రకృతి సంపదను ఎవరు కొల్లగొట్టిన వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. మట్టి తరలింపుకు తప్పకుండ మైనింగ్ అనుమతులు ఉండాలి. ఇకపై అనుమతులు లేకుండ మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రజలందరికి ఉంది. దీనిలో అందరు భాగస్వాములు కావాలి.

–సరిత, తహసీల్దార్, అమ్రాబాద్

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ శ్రీనునాయక్‌కు వినతిపత్రం అందించారు. పురుష వికలాంగులకు ఉచిత బస్సు అవకాశం ఇవ్వాలని, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, 2016 దివ్యాంగుల రక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. జీఓ నంబర్ 17ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గౌతమ్, రాజేశ్వర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ అమలు చేయాలని కోరుతూ శుక్రవారం ఆర్డీఓ సురేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు ఆనంద్, కురుమయ్యలు మాట్లాడుతూ జీఓ నంబర్ 17ను ఉపసంహరించాలని ప్రభుత్వాన్ని కోరారు.



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగులు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

లింగాల: ప్రభుత్వం భూములు, గుట్టలలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలను జరిపితే చర్యలు తప్పవని తహసీల్దార్ ఉమ హెచ్చరించారు. మండలంలోని అంబట్‌పల్లి శివారులో ఉన్న తుర్కగుట్ట సర్వే నెంబర్ 406లో అంబట్‌పల్లికి చెందిన కొంతమంది వ్యక్తులు కొన్ని రోజులుగా అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని అందుకున్న సమాచారం మేరకు ఆమె ఎమ్మార్ఐ సీతారాంనాయక్‌తో కలిసి శుక్రవారం మట్టి తవ్వకాలను జరుపుతున్న గుట్టను పరిశీలించారు. విషయం తెలుసుకున్న అక్రమార్కులు అధికారులు రాకముందే పరారయ్యారు. ఇక ముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తుర్కగుట్టను ధ్వంసం చేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు బంగారయ్య తహసీల్దార్‌ను కోరారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

వంగూరు: పోల్కంపల్లి మాజీ సర్పంచ్ చెన్నయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శుక్రవారం గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. చెన్నయ్య మరణం పార్టీకి తీరనిలోటన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పండిత్‌రావు, రమేష్‌గౌడ్, సతీష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కోడేరు: మండలంలోని రేకులపల్లి తండాలో గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందిన విద్యార్థి శివనాయక్ కుటుంబాన్ని మాజీ జెడ్పీటీసీలు బస్తీ రాంనాయక్, హన్మంత్‌నాయక్, మాజీ సర్పంచ్ లాల్‌సింగ్ తదితరులు శుక్రవారం పరామర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

బొల్లిగట్టునుంచి పలుగురాయి తరలింపు



పెద్దకొత్తపల్లి: మండలంలోని సాతాపూర్ శివారులో ఉన్న బొల్లిగట్టు నుంచి మైనింగ్‌కంపెనీకి చెందిన వారు పలుగురాయిని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఈ మైనింగ్ తవ్వకాల వలన బొల్లిగట్టు పరిసర ప్రాంతంలోని రైతుల మామిడి తోటలు, పంట పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు బీరయ్య, లింగస్వామి, రాజు ఆందోళన వ్యక్తం చేశారు. బొల్లిగట్టు సర్వేనెంబర్ 500 లలో మైనింగ్ తవ్వకాలు చేపట్టవద్దని అధికారులకు, ప్రజాప్రతినిధులకు రైతులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన మైనింగ్ తవ్వకాలు ఆగలేదని ఆరోపించారు. ప్రస్తుతం పలుగురాయి తీయడం ద్వారా వచ్చే పంటపొలాలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

నూతన భవనం నిర్మించాలి



కొల్లాపూర్ రూరల్: మండలంలోని నార్లాపూర్ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని నూతనంగా భవనాన్ని నిర్మించాలని సీపీఎం మండల నాయకుడు కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా శిథిలావస్థకు చేరిన భవనాన్ని గ్రామస్తులతో కలిసి ఆయన పరిశీలించారు. గత 50 ఏళ్ల కిందట భవనం నిర్మించారన్నారు. ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 వ తరగతి వరకు విద్యార్థుల విద్యను అభ్యసిస్తున్నారన్నారు. భవనం కూలుతుందోనని విద్యార్థులకు పాఠశాలకు రావడం లేదని వాపోయారు. ఇప్పటికైన మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సత్యానారాణ, గ్రామ ప్రజలు ఉన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారి విజయ్‌కుమార్‌పై దాడిచేసిన వ్యక్తిపై చర్యలు తీసుకొని శిక్షించాలని మున్సిపల్ కమిషనర్ కలెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో ఇష్టానుసారంగా పిండి, మిర్చి గిర్ని నడుపుతున్న శ్రీకాంత్ దుకాణాన్ని సీజ్ చేసేందుకు టీపీఓ అధికారులతో కలిసి వెళ్లారని వివరించారు. టీపీఓ సిబ్బందితో పిండిగిర్ని వ్యాపారి శ్రీకాంత్ వాగ్వాదానికి దిగి విధులకు ఆటంకం కలిగించాడని పేర్కొన్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని టీపీఓతో పాటుగా కమిషనర్ ఎస్పీ, కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

10న బహిరంగ వేలం

చారకొండ: మండలంలోని జూపల్లిలో గొర్రెల, మేకల సంత వేలాన్ని ఈ నెల 10వ తేదీన పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వినోద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఈనెల 9వ తేదీ వరకు జూపల్లి గ్రామ పంచాయతీ పేరున డిమాండ్ డ్రాఫ్టు రూ. 50 వేలు చెల్లించి పంచాయతీ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

వాల్‌పోస్టర్ విడుదల



పెద్దకొత్తపల్లి: ఎస్సీ వర్గీకరణ కోసం ఈ నెల 7న ఇందిరాపార్క్ వద్ద ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాసులు చేపట్టనున్న దీక్ష విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వర్కింగ్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో దీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీరబాబు, చంద్రబాబు, కురుమూర్తి, రాజు, బంగారయ్యలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



కల్వకుర్తి: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న 10 మంది ఉపాధ్యాయులకు తోటి ఉపాధ్యాయులు శుక్రవారం ఘనం సన్మానం చేసి వీడ్కోలు పలికారు. అదేవిధంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బాలునాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మోటార్ వైర్ల చోరీలో ఐదుగురిపై కేసు

కోడేరు: మండలంలోని కోడేరు, కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలంలో వ్యవసాయ పొలాల దగ్గర ఉన్న విద్యుత్ మోటార్ల వైర్లను చోరీకి పాల్పడిన ఐదుగురిపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ కురుమూర్తి వివరాలు ప్రకారం కొల్లాపూర్ పట్టణానికి చెందిన ఐదుగురు వివిధ గ్రామాల్లో మోటార్ల వైర్ల చోరీకి పాల్పడుతున్నారు. దొంగతనం చేసిన తర్వాత సామగ్రిని కొల్లాపూర్‌లో పాత సామాను దుకాణం నడిపే పుల్లయ్యకు విక్రయించేవారు. శుక్రవారం ఎత్తం శివారులో మోటార్ల వైరు చోరీకి వారు పాల్పడటం గ్రామస్తులు చూసి వారిని పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇద్దరు మైనర్లు కావడంతో స్టేట్‌హోంకు తరలించారు.

కుక్కల దాడిలో తొమ్మిది గొర్రెలు మృతి

లింగాల: మండలంలోని వల్లభాపూర్ శివారులో కుక్కల దాడిలో 4 గొర్రెలు, మరో 5 గొర్రె పిల్లలు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం వల్లభాపూర్, కొండారెడ్డిపల్లి మధ్యలో ఉన్న ఓ కోళ్ల ఫారం సమీపంలో వల్లభాపూర్‌కు చెందిన ఈడమోని తిర్పతయ్య చెందిన గొర్రెలు మేత మేస్తుండగా గొర్రెలపై కుక్కలు ఆకస్మికంగా దాడి చేశారు. కుక్కల దాడిలో మొత్తం తొమ్మిది జీవాలు మృతి చెందాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయొద్దు

తెలకపల్లి: ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, అశ్రద్ధ చేయొద్దని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కమ్మరెడ్డిపల్లిలో హైదరాబాద్ మలక్‌పేట యశోద ఆస్పత్రి, ఎల్‌వీప్రసాద్ తూడుకుర్తి శాఖ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. శిబిరంలో గ్రామస్తులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీ రామకృష్ణ, కార్యదర్శి సంపత్‌కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జయకుమార్, గాంధీ స్మారకనిధి ప్రతినిధి ఫౌండేషన్ అధ్యక్షుడు బుచ్చన్న, జేఎస్‌ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్‌రెడ్డి, భరత్‌సేవా సంఘం ఆర్గనైజర్ శర్మ, కమ్మరెడ్డిపల్లి మాజీ ఉపసర్పంచ్ జానకిరాంరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కల్వకుర్తిరూరల్: ఇటీవల పార్లమెంట్ సమావేశంలో హిందువులపై రాహుల్‌గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం మహబూబ్‌నగర్ చౌరస్తాలో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం వీహెచ్‌పీ నాయకుడు తలసాని గిరిధర్‌రెడ్డి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ హైందవధర్మం గొప్పదని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ హిందువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అన్ని మతాలను సమానంగా చూడాల్సిన బాధ్యత ప్రతిపక్షనాయకులపై ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుర్గాప్రసాద్, రాఘవేందర్‌గౌడ్, శేఖర్ రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, బాబిదేవ్, రాజశేఖర్, తదితరులతోపాటు పలువురు పాల్గొన్నారు.

లోపించిన పారిశుద్ధ్యం

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని 3, 7వ వార్డుల్లో పారిశుద్ధ్యం లోపించింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మురుగు వీధుల గుండా ప్రవహిస్తోంది. ఇళ్ల ముందు కంపు వాసన భరించలేకపోతున్నామని కాలనీవాసులు వాపోయారు. కొన్ని నెలల నుంచి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొన్నారు. వర్షాకాలంలో దోమలు, ఈగలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని దీంతో రోగాలబారిన పడుతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.



మూడో వార్డులో ఇళ్ల ముందు పారుతున్న మురుగు

ముమ్మరంగా జాతీయ రహదారి పనులు



పెద్దకొత్తపల్లిలో సైడ్ కాల్వల పనులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఎన్‌హెచ్ 167 రహదారి నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రోడ్డు విస్తరణ పనులతోపాటు సైడ్ కాల్వల నిర్మాణం పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం మండల కేంద్రంతోపాటు సాతాపూర్, చెన్నపురావుపల్లి, కల్వకోల్ గ్రామాల్లో రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నారు. కల్వకోల్, అంకిరావుపల్లి మధ్య బీటీని నిర్మిస్తున్నారు. మరో రెండు నెలలు అయితే సోమశిల వరకు రోడ్డు పనులు చేపట్టే అవకాశం ఉంది.

కొనసాగుతున్న ధరణి దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

పాన్‌గల్: కలెక్టర్ ఆదేశానుసారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ధరణి దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. ఆరో రోజు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ధరణి దరఖాస్తులను పరిశీలించినట్లు తహసీల్దార్ సుభాష్‌నాయుడు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మొత్తం 226 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు 57 దరఖాస్తుల సమస్యలను పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. మండల స్థాయిలో తమ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని, తమ పరిధిలో లేని వాటిని జిల్లా అధికారులకు నివేదిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌నాయుడు, ఆర్‌ఐలు తిరుపతయ్య, మహేష్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

మన్ననూర్: పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం 75వ వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం మన్ననూర్‌లోని చింతల చెరువులో రాష్ట్ర వైద్యా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేష్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, మేగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్, ఆయా పాఠశాలల విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 40 వేల మొక్కలు నాటాల్సి ఉండగా పచ్చదనం పర్యావరణం పరిరక్షణ కోసం కోటి మొక్కలు నాటాలని కోరారు. అంతకు ముందు మార్గ మధ్యలో నిరంజన్‌షావలీ దర్గాలో ముస్లింతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి, పురావస్తు శాఖ డైరెక్టర్ భారతి హోళి, త్రిపాఠి, పీసీసీఎఫ్ డోబ్రియాల్, వాణి ప్రసాద్ ఐఎఫ్‌ఎస్, ఎఫ్‌డీ శివాణి డోబ్రియా, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఐటీడీఏ పీఓ, డీఎఫ్‌ఓ రోహిత్ రెడ్డి, తాహసీల్దార్ సరిత, ఎంపీడీఓ మోహన్‌లాల్, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శంకర్‌నాయక్, అటవీశాఖ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు, అధికారులు

కోతుల బెడద నుంచి కాపాడండి

కోతుల బెడద నుంచి కాపాడాలని రాష్ట్ర మంత్రులు దామోదర రాజ నర్సింహా, జూపల్లి కృష్ణారావు, జిల్లాలోని ఎమ్మెల్యేలకు మన్ననూర్ గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు.